05112023-DIS-15_Layout 1 11/5/2023 4:03 AM Page 1



# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



# పరిపూర్ణ సామాజిక కవి దాశరథి

దాశరథి తెలంగాణ జాతిరత్నం. విశ్వ మానవ స్పందనల మహాకవి. పీడిత ప్రజావాణికి 'మైక్' గా గొంతెత్తిన యుగకవి. 'నేనురా తెలగాణ నిగళాలు (సంకెళ్లు) తెగగొట్టి ఆకాశమంత యెత్తరచినాను' అని ప్రకటించుకున్న సగర్వకవి. 'అగ్నిధార', 'రుద్రవీణ' దాశరథి తొలినాళ్ల కవితా సంపుటాల పేర్లు. కవి పౌరుషానికీ, సమరశీలతకూ ఈ పేర్లు నిలువుటద్దాలు. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ'అని ప్రపంచానికి తెలంగాణను పరిచయం చేసినవాడు దాశరథి. ఇంతగా తన జాతి పట్ల అభిమానం గల కవులు చరిత్రలో అరుదుగా ఎదురవుతారు.

దాశరథికి తెలుగుభాష అందచందాలు, స్నేహ గంధాలు తెలుసు. తన హృదయ నాదానికీ– మనో నినాదానికీ తగినట్టు తెలుగు భాషకు సొంత ఆస్తి అయిన తెలుగు పద్యాన్ని తీర్చిదిద్దిన ఆధునిక చేతనా మనస్కుడు. గేయాలను లయబద్ధంగా తూగించాడు. శ్రోతలను ఉత్తేజితులను చేశాడు. ఉద్విగ్నులను చేశాడు. పరవశింపజేశాడు.

తెలుగుభాషలో పరిపూర్ణంగా సకల వ్యక్తి స్పృహలూ ఒదిగించాడు. వచన కవితలను ఆలోచనాత్మకంగా మలిచాడు. తనదైన కథాకథన శైలిని ఎంచుకున్నాడు. నవలల విస్తృతిని పదిలంగా పెంచుకున్నాడు. నాటికల దృశ్యాలను ఒడుపుగా పేర్చుకున్నాడు. వ్యాసాల రూపురేఖలను తగినట్టు క్రమబద్ధీకరించు కున్నాడు. స్వజీవిత'యాత్రా స్మృతి'రేఖలను ఇంపుగా–సొంపుగా కనబడే బొమ్మలుగా రూపొందించుకున్నాడు. అనువాదాలను తెలుగు భాషా దీప పరంగా–పూల బుట్టగా అందించాడు. ఉపన్యాసాలలో సాహిత్యశక్తిని ప్రదర్శించాడు. జానపదుల నుంచి జ్ఞాన పదుల వరకు ఉండే జనావళికి శుభం పూచే భవితవ్యాన్ని మనసుకెక్కించాడు. కవి సమ్మేళనాలలో స్వరాపౌరుషాన్ని మలగని అఖండ దీపంగా నిరూపించాడు. ముషాయిరాలలో తాను అలరి శ్రోతలను అలరింపజేశాడు. సహ సమ ఉజ్జీ కవుల అభినందనలూ కరతాళ ధ్వనులూ విన్నాడు.

**ఒక్కమాటలో: దాశరథి – కవితా శరధి**
**వాగ్బాణాల అమ్ముల పొది.**
**ప్రజాపక్ష రథి–సారథి. ధీ–మేధావి.**

దాశరథి తన కాలంలో విలక్షణ సామాజిక కవి. రస హృదయాన్నీ – విజ్ఞాన దృక్పథాన్నీ ముడివేసిన కవి. దాశరథి ఏ రోజూ స్వార్థ ప్రయోజనాల కవి కాలేదు. అల్పసంతోషి. అనల్ప మానవతా వాది. 'తెలంగాణము రైతుదే' అని గర్జించిన సామ్యవాది దాశరథి. అవసరం వచ్చినపుడు పంజా విప్పిన పెద్దపులిలా గాండ్రించాడు. తన గుండెలను ఎదురొడ్డి ఉద్యమించాడు. కష్టాల పాలయ్యాడు. కారాగారాల్లో కృశించాడు. అయినా చెక్కు చెదరని గుండెబలంతో తన గుండెను అగ్నిగుండం చేసుకున్నాడు. జ్ఞాపకానికి నిలిచే తెలుగు పద్యం ఛందస్సును ఎంచుకొని అగ్నిజ్వాలలకు సరితూగే భావాలకు ఆక్సిజన్ అందించాడు. ప్రజా ప్రయోజనం కోసం కవిత్వ కళను ఆరాధించిన కవి దాశరథి. శబ్దశక్తి తెలిసి తన శతాబ్దాన్ని వెలిగించిన కవి దాశరథి.

అభిప్రాయాలు సరే–భావాలు మరే– ఆవేశపు పొంగులూ సరే–తగిన భాష సాధించు కోవటం ఇంకాసరే: అయినా పద్యం –కవిత్వం: శ్రోతలను మురిపించటమో, మెరి పించటమో చేయలేక పోతే కవిత్వ మల్లడం ఎందుకు కొరగాని పనే అవుతుంది. రంగులు చేతుల్లో ఉండి ఊహాలు లేకుంటే బొమ్మలు ఎలా వేయటం? ఇన్ని అంశాలు దాశరథిని మహాకవిని చేశాయి.



దాశరథి కవి హృదయానికి వ్యక్తిగత రస పిపాస ఎక్కువే. సమంజసమే. ప్రజాపక్ష సంక్షేమ కాంక్ష కూడా ఎక్కువే. తానే చెప్పు కున్నాడు. 'శృంగారం, అంగారం తనకు రెండు కండ్లు అని. ఏ కవైనా ప్రపంచంలో ముందు సౌందర్యవాది. సకల జీవిత సౌందర్యారాధకుడు. సౌందర్యం జీవిత శోభా వీచిక. ప్రపంచ జనావళికి ప్రేమే ఆక్సిజన్. సౌందర్యం స్త్రీ – పురుష ఉభయకుశల చరిత్ర రసద్రవ్యం. సృష్టి వికాసోన్ముఖం.

ఎప్పుడు ప్రజలంతా తమ ఫ్రీవిల్ పరిమితులతో సుఖశాంతులను అనుభవించగలుగుతారో అప్పుడే ఆ సమాజం వాస్తవంగా జీవించినట్టు! బతకలేని రోజులే బతుకైతే బతుకు ఎలా ఉంటుందో దాశరథి ప్రత్యక్షంగా చూశాడు. తల్లడిల్లి పోయాడు. ఉడికి పోయాడు. ఏడ్చాడు. తన బాధకు, ఆవేశానికి కవితా రూపమిస్తూ ఏమన్నాడో గమనించండి.

**'వెన్నెలలు లేవు-పున్నమ కన్నె లేదు**
**పైడి వన్నెల నెలవంక జాడలేదు**
**చుక్కలే లేవు ఆకాశ శోక వీధి**
**ధూమధామమ్ము దుఃఖ సంగ్రామ భూమి**
**జనం మనం మనం జనం'** అన్న కవి పద్యమిది.

ఇలాంటి కవి ఊరుకుంటాడా? కలం చేతపట్టి ఇలా రాయక మానుకుంటాడా?

**'మూగవోయిన కోటి తమ్ముల గళాల**
**పాట పలికించి కవితాజవమ్ము కూర్చి**
**నా కలానకు బలమిచ్చి నడిపినట్టి**
**నా తెలంగాణ కోటి రత్నాల వీణ'**

అంటూ కదం తొక్కాడు. గెలిచాడు. గెలిపించాడు. గెలుపు ఫలితాన్ని కండ్లరా చూశాడు. దాశరథి ధన్యకవి? సౌందర్యదృక్కోణంలో దాశరథి పరిపూర్ణతకు ఒక ఉదాహరణ.

**'అంత చల్లని నీ గుండె మందిదేల?**
**కోపమగ్ని కీలా మాలికోపమమ్ము**
**ఇంత చల్లని ఈ పూల చెంత ఏల**
**పెకలివచ్చునొ వక్షాన వెచ్చదనము?'**

భరతముని దగ్గర నుంచి తెలంగాణకు చెందిన చమత్కార చంద్రికాకర్త విశ్వేశ్వరుని వరకూ సాహిత్య గోష్ఠిలో చర్చించదగిన పద్యమిది–20 వ శతాబ్దికవి మన దాశరథి కవి రచన. తెలంగాణ ప్రజాజీవిత చారిత్రక క్రమంలో రూపొందిన కవి దాశరథి. అయినా తన విశాలహృదయంతో తన మనో ఔన్నత్యంతో సందర్భానుగుణంగా తేజరిల్లిన కవి.

శారీరక అనారోగ్యంతో బాధ పడ్డాడంతే కాని మానసిక దారుఢ్యాన్ని కోల్పోలేదు. శాంతియుతంగా ప్రపంచం ముందుకు వెళ్లాలని కలగన్నాడే కాని నాకేం ఒరిగిందని నిరుత్సాహ పడని కవి దాశరథి.

**దాశరథి, సినారెలు తెలంగాణ నుంచి ప్రపంచాన్ని వెలిగించి చూపిన సూర్యచంద్రులు. దాశరథి కవిగా సీనియర్. రెండు ప్రపంచయుద్ధాల తర్వాత సామాన్యుని పక్షాన తెలుగు కవిత్వం నిలిచిన మాట నిజం. కాలానుగుణంగా సామాన్యుల కోసం వచనకవిత్వం తప్పనిసరి అని గ్రహించిన కవులలో వీరిద్దరూ తక్కిన వారితో పేర్కొనక తప్పనివారే.**

అయితే ఈ మన కవులిద్దరూ భాషా సంప్రదాయాన్నీ చెడగొట్టకుండా వచన కవిత్వాన్ని రచించారు. దాశరథి తిమిరంతో ఘనసమరం జరిపిన బతుకే అమరం అని యుద్ధభేరి మోగించినట్టు మేల్కొల్పినారు. కావలసిన సమస్త రీతుల్లో వచన కవిత్వం రచించారు.

మస్తిష్కంలో లాబొరేటరీ మలుపు గెలుపు కవిత. ఒక్కమాటలో వచన కవిత్వాన్ని సాహిత్యపద బంధురం చేసి చూపిన కవి దాశరథి. ఎక్కడో గెలిచిన 'నీగ్రో' విజయాన్నీ అభినందించారు. సందర్భోచితంగా జీవితాంతం కవిత్వంతో జీవించిన కవి దాశరథి.

తెలుగు సాహిత్యానికి అదనపు ప్రక్రియలను జత చేసిన కవి దాశరథి. పాత ప్రక్రియయైన శతకాన్ని ఆధునిక చైతన్య ప్రక్రియ'గా మలిచిన కవి. తెలంగాణ జాతి దాశరథిని విస్మరించకుండా తెలంగాణ ఉద్యమ నాయకుడు, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తమ సాహిత్య పరిజ్ఞానంతో ప్రతి సంవత్సరం దాశరథి పురస్కారంతో ఒక కవిని సత్కరించటం కవి లోకానికి ఉత్తేజకరమైన ప్రభుత్వ కానుక.

**ఎందరో మహానుభావులు**
**అందరికీ వందనములు**



గురిజాల
రామశేషయ్య
70326 79471

**(నవంబర్ 5
దాశరథి వర్ధంతి)**

> దాశరథి చదువగలిగినంత కాదు, చదువవలసినంత చదివాడు. రాయవలసినవన్నీ రాశాడు. తనకు అంగార–శృంగారాలు కుడి,ఎడమ భుజాలు కాగా, కాగినాడు,వేగినాడు అక్షరాల్లో తేరినాడు. దాశరథి నిక్కమైన మంచి నీలం. మనసు ప్రవాళం. దాశరథి పద్యం కోహినూర్ వజ్రం.



## శిక్ష

తడిలేని అవని దేహం నిండా
పగుళ్ల గాయాల నొప్పులు..
పొడిబారిన మట్టి ఉసూరుమంటూ
గంతులేస్తోంది గాలితో
అక్కడక్కడా రాలిన
ఆకుల తోడుకూడా తీసుకొని..

పెళుసు వారిన కొమ్మల్లో పచ్చదనం
లోలోపల మినుకుమంటోంది ఆశగా
రెక్కలు తడిమిన జ్ఞాపకాల
ఊపిరితో...
నీడలు పారిపోతున్నాయి ఎక్కడికో
నిప్పుల కొలిమిలో ఉండలేక..

కారుమబ్బుల జాడలు అపుడపుడూ
ఊరిస్తూ విడివడుతున్నాయి..
ఏ చినుకు రాలినా,
అమాంతం తనలో ఒంపుకునేందుకు
వెర్రిచూపులు చూస్తున్న నేల..

అణువణువూ తనది చేసుకుంటూ
మనిషి చేసిన నేరానికి
శిక్ష ఇదేనని తీర్పునిస్తూ
సాగుతూనే ఉన్నాడు భానుడు
అలుపు లేక...!!



అరుణ ధూళిపాళ
87123 42323

## విశ్రాంతి లేని నిజాలు

ఒక్కో రోజుకు బాకీ పడతామో,
బాకీ తీరుతుందో తెలియదు.

**పగలంతా ఊహల్లో ఈత**
**రాత్రంతా మెలకువలో మునక**
**ఊడిగం చేసే ఆలోచనలో**
**విశ్రాంతి లేని నిజాలు**

వెలుతురును కప్పుకుని
ఎండలో ఎగురుతూ
చీకటిని చుట్టుకుని
చలిలో ముడుచుకొని

**తలను నేలలో పాతి**
**ఆకాశానికి కాళ్లను వేలాడతీసి**
**సంద్రంలా మారిన మెదడులో**
**తెరలు తెరలుగా కలలు**
**నిద్రను ఢీ కొని బద్దలైన రోజులో**
**బద్ధకంగా బతికే ఉంటాయి.**

శ్రీ సాహితి
97044 37247

## బాల్యం

స్వచ్ఛమైన పువ్వుల నవ్వులు బాల్యం!
అలుపెరుగని ఆటలు బాల్యం!!

**గాల్లోకి ఎగిరేస్తే**
**ఆకాశాన్ని అందుకున్నంత సంతోషం!**
**అందనంత దూరంలో ఉన్న**
**చందమామతో ఆడుకోవాలనే అల్లరి!!**

నిప్పును పండు అనుకొని
ముద్దాడాలనే మురిపం!
నాన్న ఒడి నుంచి
భుజానికెక్కాలనే ఉత్సాహం!!

**అంబాడుతూనే**
**అడ్డంకులెన్నో దాటే ప్రయత్నం!**
**అక్షరాలను బలపంతో**
**మళ్లీ మళ్లీ దిద్దిన జ్ఞాపకం!!**

ఈరోజు అనిపిస్తుంది, అవన్నీ.....
బాల్యంలో నేర్చుకున్న పాఠాలా
బాల్యం నేర్పిన పాఠాలా అని!!



జీ జగ్గయ్య
98495 25802

---

'నాటకాంతం హి సాహిత్యం' అనే వాక్యం నాటక వైశిష్ట్యాన్ని తెలుపుతుంది. రచనావ్యాసంగంలో మంచి అనుభవాన్ని సంపాదించిన రచయితే నాటక రచనల్లో సఫలుడు కాగలడు. సాహిత్యాధ్యాయానికే కాక సాహిత్య సృజనకు కూడా నాటకమే పరాకోటి. కనుక చేయి తిరిగిన రచయితే నాటక రచనకు సమర్థుడు. ఇలాంటి సమర్థుడైన నాటక రచయితే శ్రీమాన్ వానమామలై వరదాచార్యులు. వీరు ఖండకావ్య, మహాకావ్య రచనల తర్వాత నాటక రచనకు పూనుకొని తెలుగు సాహిత్యానికి 'వైశాలిని' నాటకాన్ని అందించారు. 'పోతన చరితము' అనే మహా కావ్య రచన చేసి 'అభినవ పోతన' బిరుదాంకితులైన వీరు వైశాలిని నాటక రచన ద్వారా 'అభినవ కాళిదాసు' అనే బిరుదుకు అర్హులయ్యారు.

# సంప్రదాయ పౌరాణికం

'కావ్యేషు నాటకం రమ్యం' అనే ఆర్యోక్తి దృశ్య కావ్య ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. దృశ్య కావ్యానికే నాటకం, నాట్యం, దృశ్యం, ప్రేక్ష్యం, ప్రేక్షణీయకం, రూపకం అనే పర్యాయపదాలున్నాయి. కానీ దృశ్య కావ్యాలన్నిటికీ జాతి పరంగా నాటకం అనే వ్యవహారమే అధికంగా వినబడుతుంది.



రచనా వ్యాసంగంలో రాణించగలిగిన రచయిత నాటక రచనల్లోనూ రాణించగలడు. నాటక రచనలో నియమ నిగళాలను పాటిస్తూ నియమిత కాలంలో ఇతివృత్తాన్ని రస నిర్భరంగా ఉత్కంఠోపేతంగా ఉండేటట్టు రూపొందించ గలుగుతాడు. పాత్రల వేషభాషాధికాలను ఔచిత్యానికి తగ్గట్టుగా రూపొందిస్తూ దృశ్య సూచ్య విభాగాన్ని చక్కగా నిర్వహించగలడు. ఎక్కడ వ్యగ్రత చెడకుండా, శైథిల్యం రాకుండా చూసుకోగలడు. అప్పుడే నాటకం సఫలమవుతుంది. అలాంటి లక్షణాలన్నీ ఉన్న నాటక రచయిత వానమామలై.

**వైశాలిని నాటకం 250 పద్యాలతో, కొన్ని దీర్ఘవచనాలతో కూడి 221 పుటల విస్తృతి కలిగి 9 అంకాలతో రాసిన మహా నాటకం. సలక్షణమైన సంప్రదాయ పౌరాణిక నాటకం. కథావస్తువు మార్కండేయ పురాణంలోని అష్టమాశ్వాసంలో గల అవీక్షితుని చరిత్ర. ఈ కథకు కొన్ని కల్పనికా విశేషాలను చేర్చి శిల్పాభిరామంగా తీర్చిదిద్ది మిశ్రమ కథగా మలిచారు వానమామలై.**

నాటకంలో కరంధముని కుమారుడైన అవీక్షితుడు నాయకుడు. విశాలరాజు పుత్రిక వైశాలిని నాయిక. నాయిక నాయకులు పూర్వజన్మలో తాము చేసిన అపరాధముల వల్ల శాపగ్రస్తులయ్యారు. వైశాలిని పూర్వజన్మలో గంధర్వరాజైన సునయుని కూతురు. అజ్ఞానం వల్ల అగస్త్య మహర్షిని అపహసించింది. దీంతో మానవకాంతగా పుట్టి విరహతాపాన్ని పొందమని మహర్షి శపిస్తాడు. అవీక్షితుడు తెలియక నాగుల పట్ల అపచారం చేసి శాపాన్ని పొందుతాడు. 'మహర్షుల కోపం మంగళములకే' అన్నట్టు వారి శాపా లే మరు జననానికి కారణమయ్యాయి. అంతేకాకుండా అవీక్షితుడు ప్రతినాయకుడైన దృఢకేశి అరాచకాల నుంచి ప్రజలను కాపాడి సమాజంలో శాంతిని నెలకొల్పుతా డు. ముఖ్య కథతో పాటు ఈ నాటకంలో అనేక ధార్మికాంశాలను సందర్భానుసారం గా పొందుపరిచారు ఆచార్యుల వారు.

తొమ్మిది అంకములు గల ఈ నాటకంలో అంగీరసం శృంగారం కాగా కరుణ, హాస్యం, రౌద్రం, వీరం అంగాలు. నాటక ప్రారంభ ప్రస్తావనలో ఒక సీస పద్యం అనుబంధంగా తేటగీతి ఉన్నాయి. తేటగీతిలో సరస కవితా కళారవీ! వరద సుకవీ! అనే పాదం కవి ప్రతిభా విశేష సంపన్నతను తెలియజేస్తుంది. నాటకం శుద్ధ విష్కంభంతో మొదలవుతుంది. ఇందులో నాయిక పూర్వజన్మ వృత్తాంతం మానవకాంతగా జన్మించడం దృశ్యమానమవుతుంది. మొదటి అంకంలో అవీక్షితుని పూర్వజన్మ వృత్తాంతంతో పాటు అవీక్షితుడు వైశాలి గురించి తెలుసుకోవడం వంటి అంశాలుంటాయి. ఈ అంకంలోనే ప్రతి నాయకుడు దృఢకేశి తారసిల్లుతాడు.

రెండో అంకంలో వైశాలిని చెలికత్తెలతో ఆడుతూ పాడుతూ ఉండడం, అవీక్షితుడు విదూషకునితో కలిసి వైశాలినిని చూడటం, ఏనుగు బారి నుంచి ఆమె ను కాపాడే సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయి. మూడో అ oకంలో వైశాలిని విరహ వేదన. నాలుగవ అంకంలో అవీక్షితుడు రాక్షసుని నుంచి వైశాలిని రక్షించడం, వైశాలిని స్వయంవరం, అవీక్షితుని నాగపాశంతో దృఢకేశి బంధించ టం వంటి సన్నివేశాలుంటాయి. ఐదో అం కంలో వైశాలిని అవీక్షితుని కారాగారం నుం చి విడిపించటం, తపస్సు కోసం సువ్రతుని ఆశ్రమానికి వెళ్లటం వంటి సన్నివేశాలుంటా యి. ఆరవ అంకంలో వైశాలినికి ఒక దేవదూత తారసిల్లడం, ఏడో అంకంలో దృఢకేశిని అవీక్షితుడు సంహరించడం, తరువాతి అంకంలో వైశాలిని, అవీక్షితుల వివాహం మరుత్తు జననం, చివరి అంకంలో భార్య పుత్రులతో కలిసి అవీక్షితుడు తన రాజ్యానికి రావడంతో నాటకం ముగుస్తుంది.

'ఎయ్యది యాది భావమగు ' అనే నాంది పద్యంతో నాటకం ప్రారంభమవుతుంది. శృంగార రస ప్రాధాన్యత కలిగిన నాటకమిది. శుద్ధ, మిశ్రా నిష్కంభాలు, ప్రవేశము అను మూడు అర్థోపక్షేపకములు నామ నిర్దేశముతో చెప్పబడ్డాయి. అంకాస్య అంకావతార చూళికలు సూచన మాత్రంగా చేర్చబడ్డాయి. పంచసంధులు వాటి అంగాలు ప్రవేశనిష్కంభాదులు. పతాక ప్రకరీ మొదలైన నాటక లక్షణాలన్నీ కలిగిన సలక్షణ రసవత్తర నాటకం ఇది. ప్రారంభంలో సూత్రధారునితో నటి జరిపిన సంభాషణలో ..

**'కతల పద్యకృతులు నెల్లరొనర్త**
**రమ్యశిల్ప కావ్య రచన మరసి**
**కనుముక్కు మూతిగల స్త్రీలు పెక్కురు**
**చక్కదనపు లేమ చిక్కునెటనొ**

అనే పద్యంలో రమ్యమైన కావ్యరచన ఎలాంటిదో నన్న సంగతి ఎంతో రమ్యంగా చెప్పారు ఆచార్యులవారు. తన అర్ధాంగి వైదేహి కోరిక మేరకు రాసిన ఈ నాటకాన్ని ఆమెకే అంకితం ఇస్తూ...

**'శీలవతి గాథ నొండు రచించి నాకు**
**గృతి నొసంగరె యంచు వినతి నొనర్చు**
**దీప్త సౌభాగ్యవతికి వైదేహి సతికి**
**అస్మదర్ధాంగికీ కృతి యంకితమ్ము'**

అని తన భార్యపై ఉన్న అనురాగాన్ని తెలియజేశారు.

తెలుగు రూపక సాహిత్యానికి 'వైశాలిని' అనే ఒక గొప్ప నాటకాన్ని అందించారు వానామామలై. ఆధునిక కాలంలో సాంప్రదాయ మార్గాన రచించిన వైశాలిని నాటకం 'శ్రేయోరాజ్య స్థాపనమే పరమ లక్ష్యంగా' చెప్పబడి, వారిలో ఉన్న అభ్యుదయ దృక్ప థం సామాజికులకు అందించడంలో కృతకృత్యమైంది.



స్వప్న భువకర్
94902 35017
(వ్యాసకర్త: అసిస్టెంట్ ప్రొఫెసర్, మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల)



## తీపి గురుతులు

అనగనగా ఒక రోజు
ఆసుపత్రి లోపలా బయటా
ఎదురుచూపుల ప్రసవం

**రెండు ఎదురుచూపుల నడుమ**
**భారత్ పాకిస్తాన్ సరిహద్దులా గేట్ బంద్**

ఒక ఎదురుచూపుల తండ్రి
ఇద్దరు పిల్లల్ని ఆడిస్తూ
కింద మీద పడుతున్న ఎంపైర్

**ఒకడు చిచ్చర పిడుగు**
**ఇంకొకడు అల్లరి టపాసు**

ఒకడు ఏడిస్తే
ఇంకొకడు సంబురమయితున్నడు
చిన్నోడిని ఏడిపించి పెద్దోడు
సుద్దపూసలా నవ్వుతున్నడు

**పిల్లలిద్దరూ**
**నింగీ నేల ఏకమయితున్న జడివాన**
**అందరి చూపు తమవైపు తిప్పుకుంటున్న**
**బుచ్చి తారా తోరణం**

పిల్లలు అల్లరి పాటల పల్లవులు
ఏ పాటకు ఏ తాళ మవ్వాలో
ఏ రాగానికి ఏ తాయిలమవ్వాలో
ఏ గీతానికి ఏ ఊరడింపు రాగం అద్దాలో
అమ్మకు మాత్రమే తెలుసు
**అయ్య**
**మంత్రదండం మరచిపోయిన ఇంద్రజాలికుడు**
**ఎటువైపు మొగ్గాలో తెలియని అమాయకుడు**

ఆ తండ్రి అంటాడు
అన్నా! కొంచెం గీ పిల్లలకు బెదురుపెట్టు అని

**కలం పట్టుకున్నం**
**కర్ర పెత్తనం ఎలా చేయగలం**
**పూవుల్ని ప్రేమించే వాళ్లం**
**పూనకం ఎలా నటించగలం**

చేజారిపోయిన బాల్యం మీద
మనసు చావని వాళ్లం
కండ్లముందు కదలాడు జ్ఞాపకాలు
ఎలా చెరిపేసుకోగలం.



గజ్జెల రామకృష్ణ
89774 12795

# వచనానికి కవచం 'కుందుర్తి'

వచన కవితా పితామహుడిగా వినుతికెక్కిన కుందుర్తి ఆంజనేయులు అభ్యుదయ కవి, తెలుగు రచయిత, ఆంధ్రదేశంలో వచన కవితోద్యమానికి ఆద్యుడు. పాతకాలం పద్యం, వర్తమానం వచన గేయం అని ఎలుగెత్తి చాటిన వచన కవితోద్యమ కారుడు కుందుర్తి ఆంజనేయులు. పద్యానిదే పై చేయిగా ఉన్నరోజుల్లో ఛందస్సు పై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు కుందుర్తి...మధ్య తరగతి, పేద, బడుగు వర్గాల జీవన స్థితిగతుల గురించి, శ్రామికులు, కర్షకుల బాధలు, వారి జీవన విధానం గురించి ఎంతో అందంగా తన కవితల ద్వారా చిత్రీకరించిన గొప్ప అభ్యుదయ కవి. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలపై పోలీసుల అమానవీయ, అమానుషమైన చర్యల గురించి తన కవితల ద్వారా ఎలుగెత్తి చాటారు.

వచన కవిత్వం రాయాలని ఒక ఉద్యమంగా ప్రచారం చేసి వర్తమాన, భవిష్యత్కాల కవులంతా వచనంలోనే కవిత్వం రాసే విధంగా పునాదులు వేశారు కుందుర్తి. ఆయన జీవితం, సాహిత్యం ఒక దానితో ఒకటి ముడిపడిపోయా యి. ఆయన వచన కవితా పితామహుడుగా చిరకాల కీర్తిని ఆర్జించారు. కుందుర్తి ఆంజనేయులు 1922లో గుంటూరు జిల్లా నరసరావుపేటలోని కోటవారి పాలెంలో జన్మించారు. నయాగరా, తెలంగాణ, ఆశ, నగరంలో వాన, నాలోని నాదాలు, మేఘమాల, దండి యాత్ర, నా ప్రేయసి, రసధుని, తీరా నేను కాస్తా ఎగిరి పోయాక మొదలగునవి ఆయన రచనలు.



పాఠకులకు సాహిత్యాన్ని చేరువ చె య్యాలనే ఉద్దేశంతో ప్రజల భాషలో వచన కవితలు రాసి పాఠకులకు చేరువయ్యారు. అందులో శ్రీశ్రీ, పట్టాభి, శ్రీరంగంనారాయణ, కుందుర్తి మొదలగువారు ముందు వరుసలో ఉంటారు. సామాన్యుల సమస్యలను, బాధలను తమ మాటల్లో రాశారు. 'ఫ్రీవర్స్ ఫ్రంట్' అనే సంస్థను స్థాపించారు. అలతి మాటలతో, పలుకుబడులతో వ్యంగ్యాన్ని ప్రదర్శించే లక్షణం కుందుర్తి కలానికున్నది.

**రచనల పూల తోటలో**
**ఛందస్సుల మొక్కలు నాటాను**
**భావనలో సామాన్యుని**
**జీవితం వలయాలు దాటాను**

సామాన్య జీవిత చిత్రణలో నుడికారాల ప్రయోగంవల్ల కవిత్వంలో దేశీయత కనిపిస్తుంది. తెలుగు కవిత్వానికి సంబంధించినంత వరకు తెలుగుదనం కనబడుతుంది. తెలుగు నేలలోని మట్టి వాసన కవిత్వమై హృదయానికి తాకుతుంది. సామాన్య ప్రజలతో తాదాత్మ్యం చెందుతూ, వచన కవిత్వాన్ని సామాన్యుని దగ్గరకు చేర్చుతూ కవితా పరిధిని విస్తృతం చేశారు.

**'స్వార్థం కట్టిన గులకరాళ్ళ**
**వంతెనే ఆలంబనగా**
**సామాన్యుల బతుకు**
**బాటకొక లంబంగా**
**ప్రగాఢ కాంక్షలతో**
**ప్రతినిమిషం బతుకు మీద ఆంక్షలతో**
**పరిపాలన సాగింది (తెలంగాణ)**

అని తెలంగాణలో నిజాం నవాబు పరిపాలన సాగిస్తున్న తీరును వర్ణించాడు. నిరంకుశ పాలనను చూడలేక ప్రజలుపడుతున్న ఇబ్బందులను తన కలం లో నింపుకుని భావాల వెల్లువను కురిపించారు. తెలంగాణ నిజాం నవాబును తనదైన కవిత్వంతో ప్రశ్నించాడు.

**'విసుక్కునే నగర ప్రజల**
**వీపులు చిల్లులు పొడిచే**
**జల్లులతో వెక్కిరిస్తుంది**
**సగం వచ్చి సగం రాక**
**స్వాగతం చెప్పని పట్న వాసాల**
**సాగిన ఉదయపు జల్లు**
**రాత్రి వచ్చిన చుట్టంలా తిష్టవేస్తుంది.**
**తీరిగ్గా' (నగరంలో వాన)**

నగరంలో కారణం లేకుండా పడే వాన గురించి చెబుతూ– మనసులో విసుక్కున్నా రాత్రి వచ్చిన చుట్టాన్ని మర్యాదచేయక తప్పని మధ్య తరగతి మనస్తత్వాన్ని చెబుతారు. పేద వారు వారి గుడిసెలు ఎక్కడ కొట్టుకు పోతాయోనని బిక్కు బిక్కు మంటూ గడుపుతారు.

పరిమితమైన జీతాలు, అపరిమితమైన అవసరాలు ఈ రెంటికీ సమన్వయం సాధించడానికి అవస్థ పడే సగటు ఉద్యోగస్తుల గురించి చెబుతూ–

**'హృదయ పాత్రలేకుండా**
**కవితా తటాకంలో దిగి**
**మంచి నీరు ముంచుకోలేక**
**మరలారు వట్టి చేతుల యింటికి'**
**(నాలోని నాదాలు)**

వచన కవిత కూడా ఒక కవితా మార్గమేనా? అంటూవెక్కిరించిన వారిని సముద్రాన్ని వెక్కిరించిన వాన పాములతో, మదపుటేనుగు నడకను చూసి నవ్విన దోమలతో పోలుస్తారు కుందుర్తి. కవిత్వాన్ని ఆస్వాదించడానికి హృదయం కావాలి. హృదయం లేని వారు తన కవిత్వంలోని లోతు తెలుసుకోలేరంటారాయన.

**'దీనికి కురవడం రాదు**
**పేదల్ని కరవడం ఒకటే వచ్చు**
**నేల మీద ప్రభువుల వాగ్దానాల**
**పాటకు పల్లవిగా**
**ఇది ఆకాశం తొడుక్కున్న**
**అబద్ధాల ముసుగేమో!**
**ఈ వీస్తున్న గాలికి ఇది ఇంకా**
**ఎంతసేపుంటుందిలే**
**ఆవిరితో కట్టిన ఈ గూడు ఏమంత**
**గట్టిగా నిలుస్తుందిలే (మేఘాలు)**

రాజకీయ నాయకులను మేఘాలతో పోల్చాడు. అవసరం లేకున్న మేఘాలు కురుస్తూనే ఉంటాయి. కానీ,రాజకీయ వర్షం ఓట్లకోసం కురుస్తుంది. పేద, బడుగు వర్గాలే లక్ష్యంగా వాగ్దానాలతో తడిపేస్తారు. రాజకీయ ప్రభువులు హామీలకు పల్లవిగా తాళం వేస్తుందని చమత్కారంగా చెప్పారు.

నా ఊహాలో వచన కవిత్వం అంటే ప్రజల కవిత్వం, నా కవిత్వానికి వ్యాకరణాలు ప్రజలు, నాకు నిఘంటువులు ప్రజల కవిత్వం, నాకు అలంకారాలు ప్రజలు అని తన కవిత్వం గురించి చెప్పుకున్నాడు కుందుర్తి. నయగారా అనే మొట్టమొదటి కవితా సంకలనాన్ని ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసులతో కలిసి వెలువరించారు. ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ, రాష్ట్రసాహిత్యఅకాడమీ అవార్డులు, సోవియట్ లాండ్ నెహ్రూ పురస్కారం లభించాయి.



బట్టు
విజయ్ కుమార్
95055 20097